బంగారు బోనమెత్తిన మైనంపల్లి



బంగారు బోనంతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని మూడు గుండ్ల నల్లపోచమ్మ ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎన్వీ సతీష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు కావలి ఈశ్వర్‌యాదవ్, పంజా శ్రీనివాస్‌యాదవ్, రవియాదవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



చిలుకానగర్‌లో పనులను పరిశీలిస్తున్న ప్రవీణ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం డివిజన్ పరిధిలోని నార్త్ కల్యాణపురి కాలనీలోని సీసీరోడ్డు పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా.. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కోకొండ జగన్, బింగి శ్రీనివాస్, బాలుగౌడ్, శివారెడ్డి పాల్గొన్నారు.

పర్మిషన్ వస్తే ప్రారంభమే..!



ఈసీఐఎల్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం

ఈసీఐఎల్‌లో కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ

- తాత్కాలిక భవనంలో 50 సీట్లతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఎన్‌ఎంసీ అనుమతిస్తే 2024–25 ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు
- కుత్బుల్లాపూర్‌లో శాశ్వత భవన నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కేటాయింపు
- ప్రిన్సిపాల్‌తో సహా అధ్యాపకుల నియామకాలు పూర్తి
- ప్రాథమిక సదుపాయాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి
- కళాశాలకు అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియాస్పత్రి
- 70 నుంచి 220 కి పెంచిన పడకల సంఖ్య

సాక్షి, సిటీబ్యూరో: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో తాత్కాలికంగా ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్‌ఎంసీ అనుమతిస్తే ఈ విద్యా సంవత్సరం 2024–25 నుంచే 50 సీట్లతో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొత్త వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణను నియమించారు. దీంతోపాటు తరగతుల నిర్వహణకు అనువైన భవనాన్ని గుర్తించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనాన్ని ఎంపిక చేసి అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నది. ప్రిన్సిపాల్‌తో సహా పలు విభాగాల అధ్యాపకుల నియామకాల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఫర్నీచర్, ల్యాబ్‌లతో పాటు మెడికల్ కాలేజీకి కావాల్సిన పరికరాలను సమకూర్చుతోంది. ప్రైవేట్ భవనంలో నిర్వహించనున్న మెడికల్ కాలేజీని ఇప్పటికే సందర్శించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ), మరోదఫా కూడా పరిశీలిస్తుందని, వారి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఎంబీబీఎస్‌లో మొదటి ఏడాదిలో 50 సీట్లతో తరగతులు ప్రారంభిస్తామని అధికార వర్గాలు పేర్కొంటోంది. క్రమంగా సీట్ల సంఖ్యను పెంచనున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ రాక, అడ్మిషన్ల ప్రక్రియ మొదలుతో మల్కాజిగిరి జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

20 ఎకరాల స్థలం

సామాన్యులకు కూడా వైద్య విద్యను అందించాలనే ఉద్దేశంలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ చొప్పున మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొత్త మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణానికి స్థానికంగా 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది.అయితే అక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో తరగతులు నిర్వహించనున్నారు.

అనుబంధంగా మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రి

ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎంపిక చేసిన జిల్లా అధికార యంత్రాంగం పడకల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం 70 పడకలు ఉండగా, ఆ సంఖ్యను 220 పడకలకు పెంచినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. అలాగే పడకల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు, పరికరాలు, వైద్యులు, సిబ్బంది సంఖ్యను కూడా పెంచారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్వహణ కోసం రిక్రూట్ చేసిన ప్రిన్సిపాల్‌తో సహా అధ్యాపకులు ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం..

ఉప్పల్: ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రవాణా సంబంధిత సమస్యల పరిష్కారానికి మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం (రీజనల్ మేనేజర్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ ఉప్పల్ డిపో మేనేజర్ హెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఉప్పల్ డిపో, కుషాయిగూడ, చెంగిచర్ల, పరిధిలోని ఆయా రూట్లకు సంబంధించి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్యలపై సంప్రదించాల్సిన నంబర్లు ఉప్పల్ డిపో మేనేజర్ 9959226140, చెంగిచర్ల డిపో మేనేజర్ 7893088433, కుషాయిగూడ డిపో మేనేజర్ 9959226145.

డయల్ యువర్ డీఎం..

బోడుప్పల్: ఆర్టీసీ చెంగిచర్ల డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. చెంగిచర్ల డిపో పరిధిలో వివిధ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు 7893088433.

ఫ్లెక్సీ తొలగింపు సరికాదు..

బోడుప్పల్: సామాజిక సేవ కార్యక్రమాలు, రాజకీయంగా ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంతమంది ఫ్లెక్సీలను తొలగించారని 15వ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి రేణుకా రవికుమార్ ఆరోపించారు. సోమవారం బోడుప్పల్‌లో ఆమె మాట్లాడుతూ.. తమను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

ట్రాఫిక్‌పై ఆటోడ్రైవర్లకు అవగాహన

ఉప్పల్: ఉప్పల్ వేంకటేశ్వర కమాన్ వద్ద సోమవారం ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి, ఎస్సై చిరంజీవిల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని, అధికారుల తనిఖీల్లో తప్పనిసరిగా వారికి సహకరించాలని కోరారు.

రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులు



సీసీరోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. వీరారెడ్డి కాలనీలో రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశల వారీగా అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. తొలి ప్రాధాన్యతగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత సీసీరోడ్డు పనులను చేపడతామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్ శోభారాణి వెంకటేశ్‌గుప్తా, మాజీ వార్డు సభ్యులు తోటకూర రవీందర్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పొంగుతున్న డ్రైనేజీ..



ఇంటి ముందు వరద నీటిని ఎత్తిపోస్తున్న వృద్ధురాలు

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ నుంచి నోమాకు వెళ్లే దారిలో నిత్యం డ్రైనేజీతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే వరదతో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పైకి వస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. ఓ వృద్ధురాలు ఇంటి ముందుకు వచ్చిన మురుగు నీటిని ఎత్తిపోస్తూ.. తీవ్ర ఇబ్బందులు పడుతోంది. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం భోగారం గ్రామానికి చెందిన గడ్డ కళ్యాణికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును ఆయన లబ్ధిదారురాలికి అందజేశారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ చెప్యాల వెంకట్రామిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నత్తి భూపాల్, గడ్డం కృష్ణ, గడ్డం రఘు తదితరులు పాల్గొన్నారు. కీసర గ్రామంలోని శివాజీనగర్‌కు చెందిన ఎల్. సంతోష్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ 21 వేల చెక్కును ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బాల్‌రాజ్, మిట్టపల్లి రాఘవేందర్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కార్యవర్గం

ఘట్‌కేసర్: సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని గురుకుల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నూతన కమిటీ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు నర్సింహారావు, ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా రంగయ్య, ఉపాధ్యక్షుడిగా యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సోమయ్య, ఎన్నారెడ్డి, కోశాధికారిగా పోచిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కృష్ణ, నాగరాజు, ముత్యాలును ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రంగయ్య మాట్లాడుతూ... సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారం కృషి చేస్తానన్నారు.

పశువులపై వీధి కుక్కల దాడి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. గత వారం ఓ బాలుడిపై దాడి చేసి గాయాలపాలు చేసి కుక్కలు తాజాగా పశువులపై దాడికి పాల్పడ్డాయి. మున్సిపాలిటీకి చెందిన నరేందర్‌రెడ్డి అనే రైతు ఆవు, లేగ దూడలపై సోమవారం కుక్కలు దాడికి పాల్పడి చెవు, గొంతు భాగంలో కొరికాయి. తీవ్ర రక్తస్రావంలో పశువులు గాయాలపాలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న ఉప్పల్ భగాయత్ సమస్యలు !



పరమేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఉప్పల్ భగాయత్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అధికారులు ఇచ్చిన మాట ప్రకారం హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. త్వరలోనే సీఎంను కలిసి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈగ సంతోష్ ముదిరాజ్, సుధాకర్, సోమ్ జంగయ్య, గౌరిగే రాజేష్ , బాలరాజ్ తదితరులున్నారు.

పోలీసుల ‘సైకిల్ పెట్రోలింగ్’



సైకిల్ పెట్రోలింగ్ చేస్తున్న కీసర పోలీసులు

కీసర: నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా కీసర ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. అందులోభాగంగా కీసరలోని మండే మార్కెట్‌లో సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక శక్తులను కట్టడి చేసేందుకు ఆకస్మిక తనిఖీలు, సోదాలు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలకు అవగాహన కల్పించారు.

మాజీ మంత్రికి నివాళి



మౌలాలి: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ సంస్మరణ సభకు మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

నియామకం

వనస్థలిపురం: టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన బత్తుల మల్లేష్‌గౌడ్‌ను నియమిస్తూ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మధుయాష్కీగౌడ్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ప్రజలు తమ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలో వెంకటేశ్వర కాలనీలో కాలనీ అసోసియేషన్ల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో కాలనీలు పెరుగుతున్నాయన్నారు. అదే క్రమంలో నేరాలు కూడా పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీల్లో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను అదుపు చేసే అవకాశం ఉంటుందన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్, పాండు, కాంగ్రెస్ నేతలు లింగంపల్లి రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు



వాణినగర్‌లో బస్సు కోసం ఎదురు చూస్తూ..



సాయినగర్‌లో రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న దృశ్యం

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్ పరిధిలో మిర్జాలగూడ, మల్కాజిగిరి, సాయిరాం థియేటర్, సాయినగర్ చౌరస్తా, వాణినగర్, మల్లికార్జుననగర్, దయానంద్‌నగర్ తదితర ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో రోడ్లపైనే నిలబడి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి బస్సుకోసం రోడ్డుపైనే ఎదురు చూడాల్సి వస్తుందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కాగితం మీదే లేవుట్!

ఓ వెంచర్‌ను చూపి మరో ప్లాట్ల విక్రయం

మేడ్చల్: డబ్బు సంపాదించడానికి ఎవరినైనా ఎక్కడైనా మోసం చేయడానికి ఓ వ్యాపారి వేసిన ఎత్తుగడ ఇది. మండలంలోని అత్వెల్లి, డబీల్‌పూర్, ఎల్లంపేట్ శివారులలో భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారి హెచ్‌ఎండీఏ, ఇతర అన్ని రకాల అనుమతులు తీసుకొని బడా వెంచర్ చేశాడు. డబీల్‌పూర్ పరిధిలో ఆ వెంచర్‌కు ఆనుకుని డబీల్‌పూర్‌కు సంబంధించిన 5582 గజాల స్థలం ఉంది. ఈ స్థలం నుంచి గ్రామానికి రోడ్డు ఉంది. ఈ నేపత్యంలో సదరు వ్యాపారి తెలివిగా ఆలోచించి ప్లాట్లు కొనుగోలు చేసేవారిని బురిడీ కొట్టించేందుకు యత్నించాడు. ఖాళీ స్థలానికి పేపర్‌పై లేవుట్ చేసి అందులో 29 ప్లాట్లను ఏర్పాటు చేశాడు. హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ఖాళీ స్థలం ఉండటంతో చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్మాలనే కుట్రలకు తెరలేపాడు. ఖాళీ స్థలంలో ప్లాట్లు చేయకుండానే పేపర్‌పై 29 ప్లాట్లు చేసి హెచ్‌ఎండీఏ వెంచర్లోని ప్లాట్లుగా చూపి విక్రయం చేసే యత్నాలు చేశారు. గతంలో ఈ విషయంపై డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జాయింట్ రిజిస్ట్రార్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిచినా అక్రమాలు ఎక్కడ ఎలా జరుగుతున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

రాణే ఇంజన్‌వాల్స్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం

మేడ్చల్: మేడ్చల్ పారిశ్రామిక వాడలోని రానే ఇంజన్‌వాల్స్‌లో ఇటీవల జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికలలో బీఆర్‌టీయూ విజయం సాధించగా సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యవర్గ సభ్యుల పరిచయ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడిగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణ, సలహాదారుడిగా ప్రభాకర్, ఉప కార్యదర్శులుగా రమేష్, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చారి, యాదగిరి తదితరులను నియమించి నూతన కార్యవర్గంను కంపెనీ యాజమాన్యంకు పరిచయం చేశారు.

సమాచార హక్కు కార్యకర్తపై కేసు ఉపసంహరణ

పోచారం: సమాచార హక్కు కార్యకర్త ఓడెల సురేష్ బాబుపై అన్నోజిగూడలోని ఎల్‌ఎన్ కాలనీకి చెందిన పి.రేణుక కేసు ఉపసంహరించుకొంటున్నట్లు అధికారులు సమాచారమిచ్చారు. పోలీస్ స్టేషన్‌లో తాను ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటున్నట్లు ఆమె లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ... కాలనీలో జరుగుతున్న అన్యాయాలపై అధికారులకు తాను ఫిర్యాదు చేస్తున్నందుకే తనపై కొందరు వ్యక్తులు కావాలని తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన బోనాల జాతర



భవిష్యవాణిలో ఏర్పుల కార్తీక్



శ్రీకృష్ణనగర్ ఊరేగింపులో ఎంపీ ఈటల రాజేందర్



ఊరేగింపులో పాల్గొన్న మేయర్ తోటకూర అజయ్‌యాదవ్

- ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న ప్రముఖులు
- వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి..
- భవిష్యవాణిలో ఏర్పుల కార్తీక్

మల్కాజిగిరి: ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర వైభవంగా ముగిసింది. రెండ్రోజులు జరిగే ఈ జాతరలో సోమవారం రంగం (భవిష్యవాణి) తదితర కార్యక్రమాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఓల్డ్ మల్కాజిగిరికి చెందిన జై భవానీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకుడు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. శ్రీకృష్ణనగర్‌లో శరత్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఫలహారం బండి ఊరేగింపులో ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్నారు.

◆ మల్కాజిగిరి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం వద్ద ఆనవాయితీగా దేవరయాంజాల్‌కు చెందిన ఏర్పుల కార్తీక్ పచ్చికుండపై నిల్చొని రంగం (భవిష్యవాణి) వినిపించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయన్నారు.



నెహ్రూనగర్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

బోడుప్పల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బోనాల ఉత్సవాలు నిర్వహించినట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోనాల పండుగ మరుసటి బోడుప్పల్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు నర్సింహ్మా, కల్యాణ్‌కుమార్, అనితయాదగిరి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాపోలు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి చంటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు రామస్వామి పాల్గొన్నారు.

గౌతంనగర్: గౌతంనగర్‌లోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఫలహార బండి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

రామంతాపూర్‌లో..

రామంతాపూర్: నెహ్రూనగర్ బద్ది పోచమ్మ దేవాలయంలో బోనాల పర్వదినం సందర్భంగా సోమవారం ఫలహారం బండి ఊరేగింపును కన్నుల పండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఏటా బద్ది పోచమ్మ ఆలయంలో బోనాల పండుగను ఫలహారం బండి ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తున్నందుకు ఆలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న్యనాగేశ్వర్‌రావు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఓల్డ్ మల్కాజిగిరిలో జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో..



గౌతంనగర్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అమ్మవారికి హారతులతో మహిళలు